# పార్వతీ పరిణయం

దక్షప్రజాపతి కుమార్తెలలో ఒకతె అయిన ఉమ తండ్రి కిష్టం లేకుండా శివుణ్ని పెళ్లాడింది. శివుడు తన హోదాకు తగ్గ అల్లుడు కాడనే నిరసన భావంతో దక్షుడు తాను తలపెట్టిన యజ్ఞానికి ఉమా శివాలను ఆహ్వానించలేదు. శివుడి మాట వినక పార్వతి పిలవని పేరంటంగా యజ్ఞానికి వెళ్లి అవమానితురాలై అగ్నిగుండంలో దూకి దగ్ధమైపోయింది.

ఇంతకన్న స్వాభావికమైన కథ నిత్య జీవితంలో కూడా ఉండబోదు. అనేక దేశాల్లో, అనేక కాలాల్లో అనేక మంది ఉమలు అనేక మంది శివులను పెళ్లాడి చిక్కులూ, అవమానమూ తెచ్చిపెట్టుకున్నారు.

అయినా నాకీ పురాణ గాథను గురించి ఇటీవల అనేక సందేహాలు బయలుదేరాయి. నిజంగా ఉమ శివుడి మీద ప్రేమ గౌరవాలుండే పెళ్లాడిందా లేక సంస్కార శూన్యులైన ప్రమథ గణాల మీదా, నాగరికత ఎరగని శివుని మీదా ఆధిపత్యం సాగించుదామని పెళ్లాడిందా? శివుడి మాట వినకుండా తండ్రి ఇంటికి బయలుదేరటంలో ఉమ అమాయకత్వంతో ప్రవర్తించిందా లేక బుద్ధిపూర్వకంగా ప్రవర్తించిందా? ఇంకో సందేహమేమిటంటే, ఉమ నిజంగా అగ్నిగుండంలో దూకిందా లేక వంటింటోకి పోయి దాక్కుందా?

అతి పవిత్రమై ఉమాశంకరుల గాథను గురించి నాకీ హేయమైన సందేహాలు గలగటానికి కారణాలేవో నేను చెప్పబోయే విషయాన్ని బట్టి మీరే గ్రహించగలుగుతారు. నా విశ్వాసంమటుకు, ఎక్కడ ఉమా శంకరులు పెళ్లాడినా అన్యాయం జరిగేది దక్షుడికీ కాదు ఉమకు కాదు. శంకరుడికే అని.

❀ ❀ ❀ ❀ ❀

పార్వతి రామకోటిగారమ్మాయి. రామకోటిగారికి చిన్నతనం నుంచీ సంస్కారవాదం అబ్బింది. ఆయన వీరేశలింగం గార్ని చిన్నతనంలో చాలాసార్లు చూశారు. కాస్త పెద్దవాడైనాక గాంధీగారి సంస్కరణలు ఆయనను ఆకర్షించాయి. కాంగ్రెసు ఉద్యమాలతో ప్రమేయం లేకుండానే ఆయన గాంధీ భక్తుడనిపించుకోగలిగాడు.

రామకోటిగారి సంస్కరణ వాదంలోగాని మరొకరి సంస్కరణ వాదంలోగాని నాకు విశ్వాసంలేదని చెప్పవలసిన అవసరం ఉంది. ముఖ్యమైన కారణమేమంటే, ఈ సంస్కరణ వాదం ఆచరణలో ఎట్లా ఉండేది చెప్పలేం. రామకోటిగారు చాలా వితంతూద్వాహాలకు సాయపడ్డాడు. ఇంకా అనేక వాటికి హాజరైనాడు. కాని ఆయన వితంతువును పెళ్లాడలేదు. సాధారణ కన్యను, అందులోనూ రజస్వల కూడా కానిదాన్ని పెళ్లాడాడు. వితంతు శరణాలయాలు గొడ్డుపోయి కాదు. ఆయన చాలామంది వితంవులను చూశాడు కూడాను. కాని వారెవ్వరి అందచందాలూ ఆయనకు నచ్చలేదు.

"వితంతువును పెండ్లాడటం నా కిష్టం లేదన్నవాళ్లు పురుగులు పడిపోతారు... వివాహం అచ్చంగా సాంఘిక దృష్టితో మాత్రమే జరపవలసిన విధి అని నేను నమ్మను. అందులో పెళ్లాడేవాడి స్వంత ఇష్టాలకు ప్రాముఖ్యం ఉంది... వివాహం మొదట వ్యక్తులకు సంబంధించినది. అనంతరం వారి ద్వారా, సంఘంతో సంబంధించినది... నాకు నచ్చిన పిల్లను నేను పెళ్లాడాను. అందుచేత తర్జన భర్జనలు అనవసరం" అంటూ రామకోటిగారు తన వివాహాన్ని విమర్శించిన ఒక స్నేహితుడికి జవాబు రాశాడు.

రామకోటి గారు అటువంటి ధోరణిలో వాదించటానికి అవకాశం ఉంది కాని ఈ వాదనను మనం విశ్వసించవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. రామకోటి గారి భార్యను నిండు యవ్వనంలోనే నేను చూడటం జరిగింది. ఆవిడలో ఆకర్షణ ఏమీ లేదు. ఆ రోజుల్లో ఆవిడను చూసి ఉండని వారు ఇవ్వాళ పార్వతిని చూడవచ్చు. పార్వతి మూడుమూర్తులా తల్లే. రామకోటిగారి వాదన ప్రకారం ఆయన చూసిన వితంతువు లందరూ ఇంకా అనాకారి వాళ్లయి ఉండాలన్న మాట. నమ్మదగిన మాట కాదు కాని రామకోటిగారు తాను సంస్కారిగా ప్రవర్తించనందుకు కారణాలు చెప్పగలిగినంత కాలమూ, నాకు సంస్కరణ వాదంలో విశ్వాసం ఉండబోదు.

రామకోటి గారి సంస్కారం గురించి నాకున్న ఒక్క సందేహాన్ని ఈనాటి వరకూ ఎవరూ తీర్చలేదు. ఆయన వితంతూద్వాహాలూ, వర్ణాంతర వివాహాలూ, హరిజనులతో సహా పంక్తి భోజనమూ మొదలైనవన్నీ ఆమోదిస్తాడు గదా ఆయన బంధుకోటి లోగల పరమఛాందసులతోను, పూర్వాచార పరాయణులతోను ఆయనకు పేచీ అన్నది ఎన్నడూ రాకపోవటానికి కారణమేమిటి? ఆయనగాని, ఆయన తమ్ములుగాని, చెల్లెళ్లుగాని, వాళ్ల పిల్లలు గాని, ఆయన కొడుకు రమాపతిగానీ వర్ణాంతర వివాహమైనా చేసుకోకపోవటానికి కారణం ఏమై ఉంటుంది? ... ఇంత కాలానికి పార్వతి ఒక హరిజనుణ్ని చేసుకున్నదనుకోండి. "రామకోటి గారి వంటి సంస్కర్త మరి పుట్టడు" అనిపించుకోవటానికి ఆయన చేసిన కృషి, పడిన శ్రమా నాకు తెలియనివి కావు. దాన్ని గురించి చెప్పవలసి వుంది మరి.

❀ ❀ ❀ ❀ ❀

పార్వతి నాకు బాగా తెలుసు. ఆమె మనస్తత్వం నాకు ఎప్పుడూ నచ్చలేదు. కాని అందుకు నేనామెను తప్పుపట్టలేదు. ఆమెకు అందచందాలాట్టే లేకపోవటమూ, అర్భకురాలు కావటమూ మూలాన తనకన్నా అందంగానూ, పుష్టిగానూ వున్నవాళ్లను చూసి అసూయ పడేది. తను కూడా ఆకర్షవంతంగా కనపడాలని చాలా తాపత్రయ పడేది. పదమూడు పధ్నాలుగేళ్లకే ఆమెకొక దురలవాటు ప్రాప్తమయింది. అదేమిటంటే, మగవాళ్లను ఆకర్షించే శక్తి తనలో ఎంత ఉన్నదీ పరీక్షచేసి చూడటం. నేను తన కన్న ఇరవై ఏళ్లు పెద్దవాణ్ణయి నప్పటికీ పార్వతి నన్ను విడిచిపెట్టలేదు. నాకు మనస్తత్వ పరిజ్ఞానం లేకపోయినట్టయితే నేను కోపం తెచ్చుకుని ఉండవలసింది. కాని నేను పార్వతికి నయానా నచ్చజెప్పాను – ఎంత కుంటికురూపి ఆడది కూడా ఎవర్నో ఒకర్ని ఆకర్షించగలుగుతుందనీ, శరీరాలంటూ ఉన్నంతకాలమూ, వాటికోసం కక్కుర్తిపడే శరీరాలు ఉంటాయనీనూ.

"అబ్బో, మీరు చాలా వేదాంతం చెప్పగలరే" అని పార్వతి నన్ను ఎత్తి పొడిచింది. ఆనాటి నుంచీ ఆమెకు నేనంటే కోపం.

పార్వతి తన అన్న రమాపతి స్నేహితులందరి మీదా తన ఆకర్షణ శక్తి పరీక్షించి చూసుకునేది. ఇటువంటి మానసిక పరిణామం పిల్లలలో కలగుతున్నప్పుడు గమనించ లేని గుడ్డివాళ్లు తల్లిదండ్రులే? పార్వతికి రామకోటిగాని, ఆయన భార్యగాని పెందలాడే బుద్ధి చెబుతారేమో అని ఆశపడ్డాను. లేకపోతే పార్వతి చాలా పెద్ద చిక్కులో ఇరుక్కుంటున్నదని భయపడ్డాను కూడాను.

తీరా ఏదీ జరగలేదు. పార్వతి బొత్తిగా అవివేకి కాదల్లే ఉంది. ఆమెకు ఎంతదూరం పోవాలో, ఏ విధంగా ఆత్మరక్షణ చేసుకోవాలో తెలుసుననుకుంటాను. ఏమైనా పార్వతి తన మీద ఇంత పొల్లుమాట రాకుండానూ, అపాయకరమైన పరిస్థితులు ఎదుర్కోకుండానూ పదమూడు పధ్నాలుగేళ్లు కొట్టుకొచ్చింది.... శంకరాన్ని పెళ్లాడేనాటికామెకు ఇరవై ఏడు నిండాయి.

❀ ❀ ❀ ❀ ❀

శంకరమూ రమాపతి కాలేజీలో నాలుగేళ్లు కలిసి చదువుకున్నారు. తండ్రి రామకోటి కన్న రమాపతిలో ఎక్కువ సంస్కారం ఉందని నా నమ్మకం. శంకరం హరిజనుడని తెలిసి రమాపతి అతనితో తరచు తిరుగుతూండేవాడు. హరిజనులపట్ల హృదయాలు కలిగినవారై, తమ హృదయాలెంత మంచివో శంకరానికి తెలియజేయ గలందులకు శంకరంతో స్నేహం చేసినవాళ్లు చాలా మంది ఉన్నారు. శంకరం వాళ్లని మానవులుగా భావించేవాడు కాదు. దేవతలనుకునేవాడు. ఇది వాళ్లకు చాలా సంతోషం చేకూర్చుతూ

ఉండేది. తమ దేవత్వం శంకరం ఎక్కడ మరిచిపోతాడో అనే భయంతో కాబోలు వాళ్లు అతనికి తాను హరిజనుడనేది ఏదో రూపంలో అనుక్షణమూ జ్ఞప్తి చేస్తుండేవాళ్లు.

వాళ్లకూ రమాపతికీ ఉన్న వ్యత్యాసం శంకరానికి చాలాకాలం అర్థం కాలేదు. పైపెచ్చు రమాపతి కన్న వాళ్లే ఎంతో త్యాగబుద్ధి కలవాళ్లల్లే అతనికి తోచేది. కారణమేమంటే రమాపతి దగ్గర తాను హరిజనుడనే మాటా, తన తక్కువతనమూ అతనికి జ్ఞాపకం వచ్చేది కాదు. ఇతరుల దగ్గర ఆ విషయం మరచిపోవటానికి అవకాశమే ఉండేది కాదు.

కాని శంకరం బొత్తిగా తెలివితక్కువ వాడు కాడు. అనేక శతాబ్దాలపాటు అతని జాతిలో అణిచిపెట్టబడిన తెలివితేటలూ, జీవశక్తీ అతనిలోనే అవకాశం చూసుకొని తోసుకొంటూ పైకి వస్తున్నవి. అతని తాతలూ, ముత్తాతలూ, ఎట్లా జీవించారో అతను మాటలతో వర్ణించటానికి వీలులేనంత గాఢంగా అర్థం చేసుకున్నాడు. వాళ్ల జీవితం ఎద్దుబండి నడకైతే తన జీవితం విమాన వేగంతో పోతున్నది. తన జాతి తరఫున అతను అనుక్షణమూ కొత్త రాజ్యాలు జయిస్తూ కొత్త ప్రపంచాలను సృష్టిస్తున్నాడు. పరిపూర్ణమైన ఆరోగ్యం కూడా ఇవ్వలేని ఈ అద్భుతమైన ఆనందం అతన్ని తరుచు పరవశుణ్ని చేసేది. ఒక్కొక్కసారి ఈ ఆనందంలో అతను ఉక్కిరిబిక్కిరి అయిపోయేవాడు. తనపేరు చివర బియ్యే తగులుతుంది. తనకు ఓపిక ఉంటే ఎమ్మే కూడా తగులుతుంది. ఆ తరువాత తనకు ఉద్యోగం దొరుకుతుంది. అప్పుడు తనకు నాగరిక ప్రపంచంలో శాశ్వతంగా స్థానం లభిస్తుంది. తను కూడా రమాపతిలాగా జీవించవచ్చు. తనకు సంస్కారం గల భార్య దొరికితే ఏలోటూ ఉండదు. తన పిల్లలు తను పెరిగినట్టు పెరగనవసరం లేదు. ఎంత మార్పు? ఎక్కడికెక్కడ?

వేటాడబడిన జంతువుకు అనుమానం జాస్తి. తనకు చేతనయినంతలో శంకరం తన స్నేహితులల్లే నటించేవాళ్లలో నిజమైన స్నేహితులెవరో తన మీద కించిత్తయినా గౌరవం లేని వాళ్లెవరో పరీక్షచేసి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అతనికి రమాపతే అందరికన్నా మంచి వాడని తెలిసిపోయింది. అయితే ఈ విషయం అతను తెలుసుకునేటప్పటికి ఇద్దరి చదువూ ఆ కాలేజీలో పూర్తి అయింది.

చదువు చాలించి జీవితంలో ప్రవేశించిన తరువాతనే శంకరంలో నిజమైన అభివృద్ధి కలిగింది. ఉద్యోగరీత్యా అతనికింద కొందరుండటమూ, వాళ్లు అతనిపట్ల వినయ విధేయతలతో ప్రవర్తించటమూ, వాళ్లలో చాలామంది అతను మంచి అధికారి అని తమలో తాము చెప్పుకోవటమూ జరిగి అతని ఆత్మవిశ్వాసం క్రమంగా అభివృద్ధి అయింది. అతను కులాన్నీ, అస్పృశ్యతనూ వదిలించుకున్నట్టే కనపడింది. సాటి ఉద్యోగులుండేవాళ్లు. వాళ్లు కులం పాటించేబాపతు కాదు. పైగా పట్నంలో పద్దాడేమో నాగరికత మధ్య జీవిస్తూ

గతం మరచిపోవటం అతనికి సాధ్యమయింది. ఈ గతం అప్పుడప్పుడూ తన దగ్గర బంధువుల రూపేణా అతనికి ప్రత్యక్షమయ్యేది. కాని అతను సాధ్యమైనంత వరకు వాళ్లను తప్పించుకు తిరిగేవాడు.

ఒకప్పుడతనికొక ఉత్తరం కూడా వచ్చింది. అది రాసినవాడెడో హరిజనుడై ఉండాలి. "నీ మోక్షం నువు చూసుకుంటున్నావు! నీ దగ్గర వాళ్లకు నువు దూరమైపోతున్నావు. నీ అదృష్టాన్ని నీ జాతితో ఎందుకు పంచుకోవు? నీ జాతిని ఉద్ధరించటానికి నువ్వేం చేశావో గుండె మీద చెయ్యి వేసి ఆలోచించుకో."

కాని శంకరం ఏ విషయమూ ఆలోచించదలచలేదు. అతను తన జీవితంలో కాస్తయినా శాశ్వత సంతృప్తి పొందదలచలేదు. అతనింకా చాలా దూరం వెళ్లదలిచాడు.

❁ ❁ ❁ ❁ ❁

కాలేజీ చదువు పూర్తి అయిన పదేళ్లకు శంకరమూ, రమాపతీ ఒక హోటల్లో కలిశారు. రమాపతి శంకరాన్ని గుర్తించలేదు. శంకరం రమాపతిని గుర్తించాడు. శంకరం జీవితం అభివృద్ధి అయి అతను మంచి స్థితిలో ఉన్నందుకు రమాపతి చాలా సంతోషించాడు. రమాపతి పట్నంలో ప్రాక్టీసు పెట్టాడు. అతనిప్పుడు ఎడ్వొకేటు.

"మేం ట్రిప్లికేనులో ఉంటున్నాం. ఒకసారి మా యింటికి రావోయ్. మా వాళ్లంతా నిన్ను చూసి చాలా సంతోషిస్తారు" అన్నాడు రమాపతి, తన విజిటింగు కార్డు శంకరానికిస్తూ –

మర్నాడు సాయంకాలం శంకరం తన సొంతకారులో రమాపతి ఇంటిదగ్గర ప్రత్యక్షమైనాడు. రమాపతి అతన్ని లోపలికి తీసుకుపోయి కూర్చోబెట్టాడు. మరి కాస్సేపటికి పార్వతి ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది.

మనుష్యుల్ని ఉబ్బెయ్యటం పార్వతికి బాగా చేతనవును.

"మీ ఇద్దరూ కలిసి చదివారంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. మీరు మా అన్నయ్య కంటె అయిదారేళ్లు చిన్నగా కనిపిస్తున్నారు. నా మాట నమ్మలేకపోతే ఇంకెవరినన్నా అడగండి" అన్నది పార్వతి ఒకసారి.

"మీరు హరిజనంటే ఎవ్వరూ నమ్మరు. నన్ను ఫూల్ చెయ్యటానికి మా అన్నయ్య అబద్ధమాడుతున్నాడు. మీ మాటలో కొంచెమైనా యాసలేందే?" అని ఆమె ఇంకోసారి అన్నది.

ఈ రెండు మాటలూ శంకరం ఆ రాత్రి పడుకునేలోగా ఎన్ని వందల సార్లు జ్ఞాపకం చేసుకున్నాడో మనం ఊహించలేం.

పార్వతి శంకరాన్ని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించిందో లేదో చెప్పటం నా వల్ల కాదు. కాని వెనకా ముందూ బాగా ఆలోచించే, లాభనష్టాలు బేరీజు వేసే ఆలోచన చేసిందని మాత్రం రూఢిగా చెప్పగలను. కాని పార్వతి తెలివితేటలెటువంటివంటే తను శంకరాన్ని పెళ్లాడ నిశ్చయించినట్టు బ్రహ్మదేవుడికి కూడా అనుమానం తట్టనివ్వలేదు.

ఇక శంకరాన్ని తన వలలో వేసుకోటానికి పార్వతి ఎటువంటి ఎత్తులు వేసిందో అసలే ఊహించటానికి లేదు. అది సులభసాధ్యమైన పని కాదు. అతనికి ఆమెకూ కులం రీత్యా ఉన్న ఎడాన్ని అతని మనసులోంచి తొలగించాలి. అడిగితే తను ఒప్పుకోవచ్చుననే ధైర్యం అతనికి కలిగించాలి. మళ్లీ తను స్వయంగా ఏ మాత్రమూ అతనికేసి ఒక అడుగు వేయరాదు. ఇదంతా పార్వతి ఎట్లా సాధించిందంటే చెప్పలేను గాని సాధించిందని మాత్రం చెప్పగలను.

పూర్తిగా ఏడాదిపాటు ఆమె పరిచయం అనుభవించిన అనంతరం ఎన్నోసార్లు ఆమె తన వెంట బీచీకి సినిమాలకూ వచ్చిన అనంతరం, శంకరం సాహసించి ఒకనాడు, రమాపతి ద్వారా తనకు పరిచయమై, రమాపతి ఇంట తరచు కనిపించే ఒక మిత్రుడితో, "నాకు వర్ణాంతర వివాహాలలో విశ్వాసం ఉంది. అటువంటి పెళ్లిళ్లతోగాని ఈ సమాజం మారదు" అన్నాడు.

ఆ ముక్కతోనే కొంపలంటుకున్నంత పని అయింది. రమాపతి ఇంటికి వస్తూ, శంకరాన్ని అంతో ఇంతో ఎరిగినవారందరూ, "ఏమోయ్, ఏ పామును దగ్గరికి రానిచ్చావు. వీడు బ్రాహ్మణపిల్ల దొరికితే పెళ్లాడేద్దామని చూస్తున్నాడు. పైకి అట్లా ఉంటాడు గాని వాడి పొట్టలో ఎన్ని ఆలోచనలు!... అసలీ మాల మాదిగల్ని దగ్గిరికి తీయటమే పొరపాటు!.. పార్వతిని వాడితో చనువుగా ఉండవద్దని కాస్త హెచ్చరించు..." ఈ విధంగా సలహాలిచ్చారు.

వాళ్లన్న మాటలన్నీ నేను చెప్పటం లేదు. దురదృష్టవశాత్తు నేను కూడా వాళ్ల పక్షం వాణ్ణయి ఉండటం మూలాన వాళ్ల కుళ్లు బయటపెట్టటానికి దడిసి చచ్చి పోతున్నాను. కాని ఒకటి నిజం... వీళ్లంతా కులంలో విశ్వాసం లేనట్టు పైకి కనిపిస్తున్నవాళ్లే. శంకరం తన ఖర్చుతో హోటలుకు తీసుకుపోయినా, తన ఇంటికి పిలిచి కాఫీ ఇచ్చినా తాగగల వాళ్లే, ఆ విషయంలో ఎవరికీ సందేహం వద్దు.

రమాపతి వాళ్లెవరితోనూ ఏకీభవించాడనుకోను. కాని వాళ్లన్న మాటల ప్రభావం అతని మీద బాగా పనిచేసింది. అతను పార్వతితో చూచాయగా, 'శంకరం బ్రాహ్మణ పిల్లను పెళ్లాడాలని చూస్తున్నాడుట' అని అన్నాడు.

"నాన్సెన్స్! తప్పేం? ఎవతె అయినా చేసుకోవటానికి సిద్ధంగా ఉంటే తప్పడం చేసుకునేకంటే, ఇటువంటివాణ్ని చేసుకుంటే పువ్వుల్లో పెట్టి పూజించటమే కాక చెప్పినట్టు వింటాడు" అన్నది పార్వతి.

ఈ మాటలు ఆమె తన పక్షానే మాట్లాడినట్టు రమాపతికి అర్థమైంది. నిజానికి పార్వతి పెళ్లి ప్రయత్నాలు పుష్కరం నుంచీ సాగటం లేదు.

ఇది జరిగిన కొద్ది రోజులకే శంకరం పార్వతిని అడిగాడు, తనని పెళ్లాడమని. పార్వతి "నా కభ్యంతరం లేదు - మా వాళ్లు ఒప్పుకుంటే" అన్నది.

ఆ తరువాత పార్వతి పదిహేను రోజులపాటు తన తండ్రితోనూ, తల్లితోనూ, హోరాహోరి పోట్లాడింది. ఈ పోట్లాటలో రామకోటిగారు చాలా మందిని తన పక్షం వేసుకుని వాళ్ల చేత తగనిపని అని పార్వతికి చెప్పించాడు. నేనొక్కణ్నే ఆయనను వంచించాను.

"పార్వతి శంకరాన్ని పెళ్లాడితే అతనికే నష్టం" అన్నాను.

ఎంతమంది ఎన్ని చెప్పినా లాభం లేకపోయింది. "మీరు ఇష్టపడకపోతే మీ ఇష్టం లేకుండా ఈ పెళ్లి చేసుకోవలసి వస్తుంది" అని పార్వతి అన్న మీదట రామకోటిగారు వెనక్కు తగ్గారు.

పెళ్లి జరిగింది. చాలా గొప్పపని చేసినట్టు, పతనమైపోతున్న సంఘాన్ని ఉద్ధరించినట్టు, రామకోటిగారు అందరితోనూ చెప్పుకుని అమాయకులను కొందర్ని నమ్మించాడు కూడాను.

శంకరం స్వప్న స్వర్గంలో ఎంతకాలం ఉన్నాడో తెలీదు. పార్వతి అతనికి కొంచెం కొంచెమే నరకం చూపసాగింది. అతని అలవాట్లన్నిటినీ ఆమె మార్చటానికి పూనుకున్నది. అతని వాళ్లందర్నీ వెలివేసింది. వంద గిరులుగీసి ఏ గిరిలోంచి అతను కాలు బయటపెట్ట ప్రయత్నించినా పోట్లాడసాగింది. ఇటు వంటి బానిస బతుకు శంకరం ఎన్నడూ బతికి ఉండడు. ఈ దుర్భరజీవితాన్ని అతను ఎన్నో నెలలు భరించాడు గాని ఆమె మీద తిరగబడ లేకపోయినాడు. ఎన్నోసార్లు ఆమె అహంకారానికి అతను క్షమాపణ చెప్పుకున్నాడు. తన అభిమానం ఎంత విసర్జిస్తే ఆమె అనుగ్రహిస్తుందో చూద్దామని పరీక్షక్కూచున్నాడు. ఏం చేసినా లాభం లేకపోయింది. ఎంత ఆత్మపరీక్ష చేసుకున్నా పార్వతి ఆలోచించినంత చెడ్డతనం అతనికి తనలో కనిపించలేదు. పార్వతి సంస్కారం తన సంస్కారం కన్న ఉత్తమమైనదని తనను తాను నమ్మించుకోవటానికి విశ్వప్రయత్నం చేశాడు.

ఒకరోజు చాలా పెద్ద పోట్లాట జరిగింది. ఆ రోజు శంకరం ఓర్పుపోయింది. తను చాలాకాలం ఓర్పు వహించాడు. ఇక ఓర్పు వహించడం పార్వతి వంతని అతనికి తోచింది. తను చాలాదూరం వెళ్లటానికి సిద్ధపడ్డట్టు తోస్తేనైనా ఆమె వెనక్కు తగ్గుతుందేమో ననుకున్నాడు. అది జరగలేదు. అతను ఎంత దూరం వెళ్లినా పార్వతి అంతకన్న దూరం వెళ్లదలచుకున్నట్టు కనపడింది. వెళ్లింది కూడాను - తన పుట్టింటికి.

పార్వతి ఎదురుగా ఉండగా అతను అనుభవించినదే నరకమైతే, ఆమె వెళ్లిన తరవాత అతను అనుభవించినదాన్ని ఏమనటానికి మాటలేదు. అతను ఒంటరిగా గదిలో కూచుని ఏడిచాడు. పార్వతి కోసం కాదు, తాను పోగొట్టుకున్న శాంతికోసం, తాను ధారపోసిన ఓర్పుకోసం, తనకు జరిగిన అవమానం కోసం!

రెండు మూడు రోజులు నిద్రాహారాలు లేకుండా వెర్రెత్తినవాడల్లే సంచరించి శంకరం తన భార్యను చూడబోయినాడు. ఆమె ఎవరోలాగా కనిపించింది. అతను విశేషం మాట్లాడలేదు.

"ఇటువంటి పెళ్లి చేసుకోకుండానే ఉండాలిసింది. ఆ తప్పు పూర్తిగా నాదే అని ఒప్పుకున్నాను. కాని తీరా చేసుకున్న తరువాత ఇటువంటి దాంపత్యం సరిగా జరగడానికి వీల్లేదని మనం ప్రపంచానికి ఎందుకు రుజువు చెయ్యాలి? ఇక ముందు ఇటువంటి పెళ్లి చేసుకోదలచిన వాళ్ల ప్రాణాలకు మనం దిష్టిబొమ్మలం ఎందుకు కావాలి?" అన్నాడు శంకరం.

"అది నా ఇల్లనే భ్రమపడ్డాను. ఆ భ్రమ తీరిపోయింది. ఈ ఇంట్లో నాకున్న స్వాతంత్ర్యంలో అక్కడ మూడోవంతు నాకు లేదు – ఉండదు. నేనెందుకు అక్కడికి రావాలి? ఇక్కడే ఉంటాను. కావలిస్తే మీరిక్కడికి రండి! నా అభ్యంతరం లేదు. ఇది దాంపత్యానికి సంబంధించిన విషయం కానేకాదు" అన్నది పార్వతి.

శంకరం ఈ ఆలోచనలకు ఒప్పుకున్నాడు. అతనికి ఉద్యోగం ఉన్నది. డబ్బున్నది. ఇప్పుడు పిల్లవాడు కూడా ఉన్నాడు. కాని సొంత జీవితం లేదు. అతనికిప్పుడు ఒక జాతి లేదు. కులం లేదు. అతని ఆత్మ ఎడారుల వెంట దిక్కు తెలియకుండా సంచరిస్తున్నది. అతను చస్తే గాని ఆ ఆత్మకు శాంతి లభించలేదు.

***కథా భారతి తెలుగు కథానికలు, 1973***